


(ప్రతినెలా ఒక మంచి పద్యం మీకోసం)

**ఉ. ఎంత తపంబు సేసి జనియించినవా రొకొ మర్త్యభామినుల్**
**కాంతు డవజ్ఞ సేసినను గాయము వాయుదు; రేనమర్త్యనై**
**చింతల వంతలం జివికి సిగ్గఱితిన్; మృతి లేనినాదు చె**
**ల్వింతయు శూన్యగేహమున కెత్తిన దీపిక యయ్యె నక్కటా!**

**- మనుచరిత్ర. తృతీయాశ్వాసము. పద్యం. 8**

పై పద్యం సాహితీసమరాంగణ సార్వభౌముడైన శ్రీకృష్ణదేవరాయల చేత "ఆంధ్రకవితాపితామహా!" అని పిలిపించుకున్న అల్లసాని పెద్దన వ్రాసిన మనుచరిత్రలోనిది. తెలుగు పంచకావ్యాల జాబితాలో మనుచరిత్ర ఎప్పుడూ మొదటిదిగా చెప్పబడుతుంది.

"తక్కిన వారికంటే కాస్త మించి ఉన్నాడు" అని ఎవరి గురించి అయినా చెప్పేటప్పుడు "వాళ్ళకంటే వీడు నాలుగాకులు ఎక్కువ చదివాడు" అనడం లోకసాధారణం. మరి సకలపురాణేతిహాసాలతో బాటు, తనకు పూర్వం ఉన్న కవిత్రయాది కవులందరినీ క్షుణ్ణంగా చదువుకుని, భావికవులకు ప్రబంధమార్గాన్ని ఏర్పరచిన పెద్దన "నాలుగాకులేవిటి పదాకులు ఎక్కువ చదివేడు" అన్నా- అది అతిశయోక్తి కాదు. ఆరుద్రగారు కూడా పెద్దన గురించి "ఆయనలో పూర్వకవుల శుభలక్షణాలన్నీ ఒక్కరూపున మూర్తీభవించి సాక్షాత్కరిస్తాయి" అన్నారు.

ఇప్పుడు పైన చెప్పిన పద్యానికి పూర్వరంగం ఏవిటో చూద్దాం. పూర్వరంగం అంటే గుర్తొచ్చింది. మనుచరిత్రలో మనువైన "స్వారోచిషు"ని గురించి చెప్పేవి కావ్యం చివరిలో ఉన్న 21 పద్యాలు మాత్రమే. దీనికి ముందు చెప్పబడిన కథ అంతటిలో ఈ మనువు జన్మకు దారితీసిన సంఘటనలు మాత్రమే ఉన్నాయి. ఇలా చివర ఉన్న వృత్తాంతానికి తక్కిన గ్రంధం అంతా పూర్వరంగమే అవుతుంది. "మనుచరిత్ర" అన్నది లోకప్రసిద్ధమైన నామం అయినా "స్వారోచిషమనుసంభవం" అన్నదే దీనికి తగిన పేరు.

మనుచరిత్ర కథ యావత్తు తెలిసినా తెలియకపోయినా, వరూధినీ ప్రవరాఖ్యుల కథ తెలియని తెలుగువాడుండడు. ఆంధ్రదేశంలో "అపర ప్రవరాఖ్యుడు" అన్నది నలుగురి నోటా నానే నానుడి అయికూర్చుంది. సిద్ధుడు పూసిన పసరు మహత్తు వల్ల, హిమగిరిని చేరుకున్నాడు... మకరాంక శశాంకమనోజ్ఞమూర్తి(చందమామలాంటి రూపంకలవాడు), అలేఖ్యతనూవిలాసుడైన(చిత్రంలో

ఒదగని అందమైన శరీరం కలవాడు) ప్రవరాఖ్యుడు. అందంలో జయంత,వసంత,కంతులని జయింపజాలిన రూపురేఖావిలాసాలుగల ఆ భూసురుణ్ణి చూసి వలచి వెంట పడింది వరూధిని. ఈ ప్రవర్తన ఏదో కూడని పనిలాగ కనబడి, వరూధిని పట్ల కాస్త చులకన భావం కలుగుతుంది. కాని పరిశీలించి చూస్తే అది నిజంకాదు అని అర్ధం అయిపోతుంది. తనకు నచ్చిన మనిషో, వస్తువో, సంపదో, సుఖమో కావాలని వాంఛించడం అన్నది మానవలక్షణమే కాదు, దేవుడు సృష్టించిన ప్రతిజాతిలోనూ ఉంది. ఆఖరికి ఆ దేవతలలో కూడాను. వరూధిని ప్రవర్తన ఇందుకు భిన్నంగా ఏమాత్రం లేదు. సాధారణంగా తమను ఆకట్టుకున్న దాని మీద మోజుపడి, మోహపడేవారు, వాళ్ళ శక్తి సామర్ధ్యాలని గణించకుండానే ఆ కోరికని పెంచుకుంటారు. ఇది మానవసహజం.

మరి ఇక్కడ వరూధిని సామాన్యస్త్రీ కూడా కాదు. గంధర్వకాంత. యక్షులు, గంధర్వులు దేవతామహిమలు,శక్తులు కలవాళ్ళు. విమలగాంధర్వవిద్యా పారీణురాలు,విద్యుల్లతావిగ్రహ,శతపత్రేక్షణ, చంచరీకచికుర,చంద్రాస్య అయిన ఈ వరూధిని దేవకాంతలలో శిరోమణి లాంటిది. సాధారణ వ్యక్తే తనకిష్టమైన దానిని కోరుకోగాలేంది, వరూధిని లాంటి మరున్నారీశిరోమణి అందచందాలలో తనకు సమఉజ్జీగా కనబడిన ప్రవరుణ్ణి కోరుకోడంలో అసమంజసం ఏముంది?

ప్రవరుని కోరి ఆమె చేసిన ప్రయత్నం ఫలించలేదు. వరూధినిని కాదని త్రోసిపుచ్చిన ప్రవరుడు, అగ్నిదేవుని సహాయంతో ఇల్లు చేరుకున్నాడు. ప్రవరుడి మీద మనసు లగ్నం అయిన వరూధిని విరహవేదనకి గురైంది. దుఃఖసాగరంలో మునిగిపోయింది. తాను కొఱగాని నోములు నోచుకున్నానన్నది. ప్రవరుడి సౌందర్యాతిశయాన్ని మరోసారి తలుచుకుంది. చంద్రుడిని,మలయానిలయాన్ని నిందించే దాకా రాలేదు. ముందుగా తన అసమర్ధతను తానే నిందించుకుంటూ ఈ విధంగా పరితపిస్తుంది.

“భూలోకవాసులైన స్త్రీలు ఎంత తపస్సు చేసుకుని పుట్టారో కదా! మానవ స్త్రీలు భర్త లేదా ప్రియుడు అవజ్ఞ చేసిన అంటే తిరస్కరించితే, తమ శరీరాన్ని వదలి ప్రాణత్యాగం చేసుకుంటారు. మరి గంధర్వ స్త్రీనైన నేను అశక్తురాలినై , బాధతో దుఖః పడుతూ, చివికి పోతూ, సిగ్గు విడిచిన దాన్నయ్యాను. చావులేనిది నా శరీరం. దీని సౌందర్యం అంతా శూన్యగృహాన్ని చూపించటానికి పట్టుకున్న దీపం లావుంది కదా!" అని వాపోతోంది గంధర్వకాంత,వరూధిని. మానవకాంతలు ఎంతో తపస్సు చేసి పుట్టి ఉంటారు - అనడంలో ...

తపస్సుకు ఫలం పుణ్యమే కాదు. తపోశక్తి. దాని ద్వారా తమకు కావలసినది చెయ్యగలిగే శక్తి సామర్ధ్యాలు కలిగి ఉండడం. వరూధినికి తాను గంధర్వజాతిలో పుట్టటం అన్నది వరంకాదు. దాని వలన తనకు అబ్బిన అదృష్టం అంటూ ఏమీ లేదు. తాను దేవతాశక్తితో సాధించలేనిది మానవస్త్రీలు అతిసులువుగా చెయ్యగలుగుతున్నారు.

“ మృతిలేని నాదు చెల్వింతయు శూన్యగేహమున కెత్తిన దీపిక యయ్యె ” తన కున్న అపూర్వ సౌందర్యమంతా ఎంత వ్యర్ధమయినదో చెప్పడానికి ఉపయోగించిన సామ్యం దీపిక. దీపం కాంతివంతమైనది. దాని వెలుగుతో తాను తాకిన వస్తువులని

బాగా కనబడేటట్టు చెయ్యడం దాని గుణం. ఇక్కడ ప్రకాశించవలసింది. తన భాగ్యం, అదృష్టం. ప్రవరుని సాంగత్యాన్ని పొందని తాను శూన్యగృహం వంటిది. తన శరీరం ఎంత సౌందర్యాతిశయం గల దైతేనేమి. అది రిక్తము, వ్యర్ధము అయినదే అవుతుంది కదా.

వరూధిని సౌందర్యానికి దీపత్వాన్ని ఆరోపించటంలో మరోసారి ఆమె సౌందర్యాతిశయానికి హారతులెత్తటము, తనను మర్త్య భామినులతో పోల్చుకుని తనకంటే వారే అదృష్టవంతులనడంలో ఆమె నిస్సహాయత, నిరాశలను తెరతీసి చూపించడం జరిగింది. పెద్దనగారి కవితాచాతుర్యానికి ఇదొక మచ్చుతునక. అల్లసాని పెద్దన ఉయ్యాలమంచంమీద ఊగుతూ వ్రాశారో, ఊగకనే వ్రాశారో తెలియదు గాని, మనుచరిత్రలో ఆయన కవితాశైలికి ఊగని,తూగని పాఠకుడు అంటూ ఉండడు.

●●●

COMMENTS